క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోవాలి



టీషర్టులతో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు

తాంసి: యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు ఫర్ ష్యూర్ అని ముద్రించిన టీషర్ట్‌లు ధరించి విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విష్ణు, ఆర్ఐ మహేందర్, జూనియర్ అసిస్టెంట్ బాపురావు, రాఘవేంద్ర, స్వామి పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బొక్కల్‌గూడ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న హైదరాబాద్‌లో నిర్వహించే మిలాద్ ఉన్ నబీ బహిరంగ సభకు ఆదిలాబాద్ నుంచి భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు రషీద్, అశోక్, జాఫర్, సిరాజ్ ఖాద్రి, జిషాన్, షాన్‌వాజ్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

బోథ్: మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జబీర్‌కు కార్యాలయం ఎదుట బుధవారం సెల్‌ఫోన్ దొరికింది. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫోన్‌ను అప్పగించారు. ఫోన్ మండల కేంద్రానికి చెందిన మహిళకు చెందినది కావడంతో ఆమెకు అప్పగించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉట్నూర్‌రూరల్: పాత ఉట్నూర్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10:30 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రావణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండల విద్యుత్ వినియోగదారులు దీర్ఘకాలిక సమస్యలు ఉంటే పాల్గొని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

భూమిపూజ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఎంపీపీ గండ్రత్ రమేశ్ బుధవారం భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గూడలను, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాంసం వినోద్, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, పీఏసీఎస్ చైర్మన్ మెస్రం పరమేశ్వర్, బొమ్మకంటి రమేశ్, జిట్ట రమేశ్, అంకత్ శ్రీనివాస్, క్రిష్ణ పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసండ్ల ప్రభాకర్ తల్లి దాసండ్ల శాంతమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రషీద్, లచ్చు పటేల్, భరత్, బాజీరావు, అనసూయ, భూమన్న, సత్తన్న ఉన్నారు.

బ్యాగులు పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చిన్న లోకారి, లింగుగూడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మణ్, స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్, సురేశ్, సాయి, మోతీలాల్, ఉపాధ్యాయులు పంచశీల, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు ఏర్పాటు

నేరడిగొండ: మండలంలోని సవర్గాం గ్రామ శివారు పెద్దమ్మ ఆలయం వద్ద చేతిపంపును బుధవారం ఎంపీపీ రాథోడ్ సజన్ ప్రారంభించారు. ఎంపీపీ నిధులతో బోరుబావితో పాటు ఆలయం వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్యాణి మహేందర్ జాదవ్, ఉప సర్పంచ్ మద్దెల పద్మ నారాయణస్వామి, శ్రీనివాస్ రెడ్డి, పాండు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి

- కనిపించని తెగుళ్ల ఉధృతి
- దిగుబడిపైనే ఆశలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



జైనథ్‌లో ఏపుగా పెరిగిన పత్తి

జైనథ్: తెల్లబంగారంగా పిలువబడే పత్తికి ఆదిలాబాద్ జిల్లా కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఆసియాలోనే ఆదిలాబాద్ పత్తి మార్కెట్‌కు మంచి పేరుంది. మొదట్లో నాన్ బీటీ పత్తి విత్తనాల వలన, పత్తిలో చీడపీడల బెడద ఎక్కువగా ఉన్నప్పటికీ దిగుబడులు బాగానే వచ్చేవి. కానీ బీటీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చిన తరువాత పరిస్థితి మారిపోయింది. బీటీ విత్తనాల వలన దిగుబడులు రెండింతలయ్యాయి. 2005 నుంచి తెగుళ్ల ఉధృతి పెరిగింది. బీటీలో గులాబీ రంగు పురుగు ఉధృతి విపరీతంగా పెరగడంతో గత కొన్ని సంవత్సరాలుగా పత్తి రైతులు కుదేలవుతున్నారు. ఏడాది పాటు కొనసాగే పత్తి పంటను మధ్యలో తొలగించి, రబీలో ఇతర పంటలు వేసుకునే పరిస్థితి వచ్చింది.

అన్నింటిని తట్టుకొని..

గులాబీ రంగు పురుగు నివారణ గురించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేయడం, బీటీ విత్తనాల వాడకంపై అవగాహన పెరగడంతో గతేడాది జిల్లాలో గులాబీ రంగు పురుగు బెడద అంతగా కనిపించలేదు. గత నాలుగైదు ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఎకరానికి 10– 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈఏడాది కూడా పత్తి ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో అనావృష్టి, జూలైలో అతివృష్టి పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రస్తుతం పత్తి ఏపుగా పెరిగింది. జూలైలో కురిసిన భారీ వర్షాలకు పెన్‌గంగ నదీ తీరంలో ఉన్న పత్తి నీట మునిగిపోవడంతో, అక్కడి రైతులు రీ సోయింగ్ చేసుకోవాల్సి వచ్చింది. దీంతో నదీ పరివాహక ప్రాంతంలో పత్తి పంటలో ఎదుగుదల కొంత ఆలస్యంగా కనిపిస్తోంది. వాతావరణం అనుకూలిస్తే అక్కడ కూడా మాములు స్థితికి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం చాలా అరుదుగా గులాబీ రంగు పురుగు కనిపిస్తున్నప్పటికీ దాని వ్యాప్తి, ఉధృతి పెద్దగా లేకపోవడంతో పంటలు సురక్షితంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

4.12 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈఏడాది ఏకంగా 4.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది 3.80 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా.. ఈఏడాది 30 వేల ఎకరాల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పత్తికి మార్కెట్‌లో మంచి ధర, అమ్ముకునేందుకు మార్కెట్‌లు అందుబాటులో ఉండడంతో రైతులు పత్తిసాగుపై మక్కువ చూపుతున్నారు.

మండలాల వారీగా పత్తి సాగు..

మండలం	రైతుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఆదిలాబాద్ రూరల్	10,743	32,608
ఆదిలాబాద్ అర్బన్	106	305
బేల	10,520	31,230
జైనథ్	11,450	34,830
మావల	521	1,674
బజార్‌హత్నూర్	7,809	22,682
బోథ్	10,704	28,563
నేరడిగొండ	9,089	23,200
గుడిహత్నూర్	6,105	16,898
ఇచ్చోడ	8,852	25,203
సిరికొండ	5,479	20,056
భీంపూర్	7,680	26,865
తలమడుగు	10,653	31,502
తాంసి	5,143	15,361
గాదిగూడ	6,451	23,285
ఇంద్రవెల్లి	7,776	25,075
నార్నూర్	6,459	21,321
ఉట్నూర్	9,498	31,775
మొత్తం	1,35,038	4,12,441

ప్రజలకు అవగాహన పెరిగింది



బీటీ పత్తి విత్తనాల చుట్టూ నాన్ బీటీ విత్తనాల వరుసలు పెడితే, బీటీ పంటకు చీడపీడలు ఆశించకుండా ఉంటాయి. పత్తిలో గులాబీ రంగు పురుగుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఇచ్చాయి. పత్తి పంటలు చాలా బాగున్నాయి. – ఏవో, వివేక్, జైనథ్

పంట బాగుంది



ఈ ఖరీఫ్‌లో ఐదు ఎకరాల్లో పత్తి వేయడం జరిగింది. జూన్‌లో వర్షాలు లేక ఇబ్బంది పడ్డాం. జూలైలో భారీ వర్షాలకు పత్తి కొంత దెబ్బతిన్నప్పటికీ ప్రస్తు తం కోలుకుంది. వాతావరణ ఇలానే అనుకూలిస్తే, ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. – కాంబ్లే ఆనంద్ రావ్, లక్ష్మీపూర్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

ఇంద్రవెల్లి: ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు కనక తుల్సీబాయి, కాంతలు కోరారు. ఈనెల 25 నుంచి సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతం పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కుమ్ర లక్ష్మీబాయి, పెందోర్ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



ప్రవచనాలు చేస్తున్న స్వామీజీ

బోథ్: మండలంలోని సొనాల రామాలయంలో దుర్గా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో బుధవారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అంతకు ముందు హనుమాన్ చాలీసా రథం పురవీధుల గుండా సాగింది. మహిళలు రథ యాత్రకు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.

మట్టి గణపతులే మేలు

- పలు మండపాల్లో మట్టి గణపతుల ప్రతిష్ఠాపన
- పర్యావరణాన్ని కాపాడటంలో ఆదర్శం

బోథ్: రంగు రంగుల గణపతులు కాదు.. ఆరాధనే ముఖ్యమని పర్యావరణ ప్రేమికులు, మట్టి గణపతుల మండపాల నిర్వాహకులు చెబుతున్నారు. రంగులు, రసాయనాలుతో కూడిన గణపతులను ప్ర తిష్ఠించకూడదని, పర్యావరణాన్ని కాపాడుకోవా లని నిర్ణయించుకున్నారు. దీంతో గత కొన్నేళ్ల నుంచి మట్టితో తయారు చేసిన గణపతులను ప్రతిష్టిస్తున్నారు. మరికొందరు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

మట్టితోనే లోకమాన్య గణేషుడు..



మండల కేంద్రానికి చెందిన లోకమాన్య యూత్ సభ్యులు 13 సంవత్సరాలుగా మట్టి గణపతినే ప్రతిష్టిస్తున్నారు. గణపతి రూపం ముఖ్యం కాదని ఆ రాధించడం ముఖ్యమని పేర్కొంటున్నారు. పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ కాపాడాలని కోరుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కరగాలంటే చాలా సమయం తీసుకుంటుందని వారు పేర్కొంటున్నారు.

రామాలయంలోనూ..

సొనాల గ్రామంలోని రామాలయంలో మట్టితో తయారు చేసిన గణపతి కొలువుదీరింది. హిందూ జాగరణ మండలి ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల నుంచి మట్టితో తయారు చేసిన గణపతిని ప్రతిష్టిస్తున్నారు. ఈ గణపతిని గ్రామానికి చెందిన శ్రీనివాస్, రమేశ్‌లు అనే ఉపాధ్యాయులు తయారు చేశారు. ప్రతిఒక్కరూ మట్టిగణపతిని ప్రతిష్ఠించి పూజించాలని కోరుతున్నారు.



కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



బీఆర్ఎస్‌లో చేరిన వారితో అనిల్‌జాదవ్

నేరడిగొండ: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బంధం గ్రామానికి చెందిన 40 మంది ఆదివాసీ యూత్ సభ్యులు జంగు ప్రసాద్, బదిరవ్ రమేశ్, శ్రీకాంత్, లక్ష్మణ్, భాస్కర్, హనుమంత్, జైరాం, నందు, బాలాజీ, దశరథ్, సంతోష్, శ్రీరామ్, కార్తీక్, ధర్మ రాజ్‌లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గులాబ్ సింగ్, కిషోర్, రాథోడ్ కమల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని తేజపూర్‌లో వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బద్దం భూమారెడ్డి, సామ జగదీశ్వర్ రెడ్డి, నల్ల లక్ష్మణ్, సురేందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అనిల్‌జాదవ్‌ను కలిసిన యూత్ సభ్యులు

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన యూత్ సభ్యులు బుధవారం అనిల్‌జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ’కు చట్టబద్ధత కల్పించాలి



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇచ్చోడ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఎస్సీవర్గీకణ కోసం ఎమ్మార్పీఎస్ సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు హామీ ఇచ్చి నేడు విస్మరించిందన్నారు. మండల అధ్యక్షుడు చిట్టి రవి, దుబాక సుభాష్, సిరిసిల్ల భూమ య్య, గోనే అడెల్లు, మధుకర్, జన్నరపు సాయి పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణను పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి కుమురంభీం చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా ఉద్యమిస్తున్న మాదిగలకు న్యాయం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు రాజు, వెంకటేశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సుద్దాల గంగన్న, శివకుమార్, దినేష్, క్రాంతి కుమార్, రాజు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో ఆర్డీవో సమావేశం

కైలాస్‌నగర్: వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో స్రవంతి బుధవారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. నూతన ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణల ప్రగతిపై చర్చించారు. దీనిపై రాజకీయ పక్షాల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ల నమోదుపై సలహాలు, సూచనలు ఇచ్చారు.

బోథ్‌ను డివిజన్‌గా చేయండి



దీక్షలో కూర్చున్న హనుమాన్‌నగర్ యువకులు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని హనుమాన్‌నగర్‌కు చెందిన యువకులు బుధవారం దీక్ష చేపట్టారు. కాగా డివిజన్ కోసం చేస్తున్న దీక్షలు 67వ రోజుకు చేరుకున్నాయి. గురువారం ఆయా పాఠశాలలు, కళాశాల విద్యార్థులచే బస్టాండ్ వద్ద ర్యాలీ, మానవహారం నిర్వహించనున్నట్లు బోథ్ డివిజన్ సాధన సమితి తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఉట్నూర్ అధ్యక్షుడు ఎస్. ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి జావిద్‌లు అన్నారు. బుధవారం ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేసి, 12 నెలల పాటు వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో శంకర్, దేవన్న, నారాయణ, సుధాకర్, స్వామి, దినేశ్, శ్వేత, స్వప్న, ఫాతీమా, యోగ లక్ష్మి, చరన్, హంసరాజ్ పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి జైనథ్ మండలం కూర గ్రామానికి చెందిన దత్తురెడ్డి రక్తదానం చేసి ఉదారతను చాటాడు. బేల మండలం బెదోడ గ్రామానికి చెందిన కె.మనోజ్‌కు ప్లేట్‌లేట్స్ తగ్గడంతో విషయం తెలుసుకున్న దత్తు ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశాడు.

‘అధికారిపై చర్యలు తీసుకోవాలి’



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: ఇళ్ల స్థలాల ఎంపికలో అవకతవకలకు పాల్పడిన అధికారిపై చర్యలు తీసుకోవాలని అడిగామ(కె) గ్రామస్తులు కోరారు. బుధవారం తహసీల్దార్ తుకారాంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అడెగామ(కె) శివారులోని భీమన్న గుట్ట వద్ద ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల ఎంపికలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. సంబంధిత సర్వే అధికారి అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించారని మండిపడ్డారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాయన్న, రాజుచారి, రమేశ్, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

కొలాంగూడలో తాగునీటి కష్టాలు



చేతిపంపు వద్ద గిరిజనులు

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్, ఆంద్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామానికి నెల రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని 40 కుటుంబాలు ఒకే చేతిపంపు వద్ద నీటిని పట్టుకుంటున్నారు. భగీరథ నీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి భగీరథ నీటిని సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాహుల్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సాగర్

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అంకోలి ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి రాహుల్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల సబ్‌సెంటర్ పరిధిలో లోహార గ్రామ పంచాయతీలో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్రం అనుసూయ, సోము, ఆరోగ్య పర్యవేక్షకుడు బొమ్మెత సుభాష్, ఎంఎల్‌హెచ్‌పీ సోహెబ్, సిబ్బంది పవర్ ప్రేమ్ సింగ్, రాథోడ్ చంద్రకళ, భరత్ ఆడే పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్ఎంలు సుధారాణి, పద్మ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

గ్రామాల్లో ఏర్పాటు చేయాలి

ఇంద్రవెల్లి: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సోయం రాందాస్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి వినతిపత్రం అందజేశారు. డెంగ్యూ జ్వరంతో ఇప్పటికే ఇద్దరు చిన్నారులు మృతి చెందారని పీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీఎస్పీ ఇంద్రవెల్లి మండల అధ్యక్షులు పెందోర్ అంకుష్, చిట్టి మల్లి వెంకటేశ్, దాసం కాంత్రి, మెస్రం మురారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గణనాథుడికి పూజలు చేస్తున్న బలరాం జాదవ్

నేరడిగొండ: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మథురనగర్ గణేష్ మండలి వద్ద గణనాథుడికి తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రథానికి ఘన స్వాగతం

బోథ్: మండల కేంద్రానికి వచ్చిన తిరుమలేశుని రథానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా వేంకటేశ్వర స్వామికి భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ మండల కేంద్రతో పాటు పలు గ్రామాల్లో రథయాత్ర సాగింది.